24/1/90

దేవుడు

ఉపద్రష్ట సాయి

వర్షం భారీ వర్షం. ఎడ తెరిపి లేకుండా కురుస్తూంది వర్షం. అప్పటికి మూడు రోజుల బట్టి విసుగు విరామం లేకుండా కురుస్తున్న వర్షం ఆగే సూచనలు కనిపించ లేదు. ఆకాశం అలసి పోలేదు. పైగా మరిన్ని దట్టమైన మేఘాలు క్రమ్ముకు వస్తున్నాయి. చిక్కని బూడిద రంగులో ఆకాశం ముసుగేసిన దెయ్యంలా భయం కరంగా కనిపిస్తూంది. "చినుకు రాలదా, అనుకున్న వాళ్ళే' చినుకు ఆగదా' అను కుంటున్నారు. అయినా లాభం లేక పోయింది. పదునైన బాణాల్లా వాన చిను కులు భూమిని తవ్వేస్తున్నాయి.

కాసేపు వర్షం ఆగితే ...
కూరో నారో తెచ్చుకోవచ్చు.
కాసేపు వర్షం ఆగితే ...
గంజో అన్నమో చేసుకోవచ్చు.
అనుకుంటున్నారందరూ.
అయినా వర్షం ఆగలేదు.

ఆగలేదు కదా ... ఆగలేదు. దానికి తోడు గాలి కూడా ప్రారంభం అయింది. అంత వరకు ఉరుముల చప్పుడు భయం కరంగా వినిపిస్తూంది. చెవులు తూట్లు పడిపోయేలా ఆకాశం ఉరుముతుంటే జనం భయపడిపోతూ అర్జున ః ఫల్గుణ ః అని చెప్పకుంటున్నారు. ఉరిమి ఉరిమి ఫడేలుమని పిడుగులు కురిపిస్తున్న ఆకాశం ప్రకృతి మీద విరుచుకు పడుతూన్నట్లు అనిపించింది. చేస్తున్న పనులు ఎక్కడివి అక్కడ ఆపేసి బిక్కు బిక్కు మంటూ చూస్తున్నారు జనం.

వర్షం తగ్గలేదు.
గాలి వేగం పెరిగింది-
హోరుమన్న శబ్దం దిక్కులు
పిక్కటిల్లేలా వినిపిస్తూంది.
ఉరుములు తగ్గాయి.
దూరంగా పెద్ద పెద్ద వృక్షాలు
కూడా పడిపోతున్నాయి.
పొలాలు నాశనమై పోయాయి.

ఏడాది కేడాది ఈ భీభత్సం తప్పదా? అనుకుంటున్నారు జనం. ఎంతో కష్టపడి, అప్పులు చేసి, పండించుకున్న పంటలు పోయాయి. అంధకార బంధురమైన భవిష్యత్తును తలచుకుని ఏడుస్తున్నారు కొందరు.

ఆకలితో పిల్లలు గుక్క తిప్పకోకుండా ఏడుస్తున్నారు. వర్షం ఒకవైపు గాలి హోరు మరో వైపు పిల్లల ఆక్రందన ఇంకోవైపు. ఏం చెయ్యాలో తెలియకుండా దిగ్భ్రాంతులై నిలబడిన జనం 'వర్షం తగ్గదా' అనుకుంటున్నారు.

గాలి కాస్త పెనుగాలిగా మారింది.

'తుఫాను వచ్చింది రోయ్' అన్నారెవరో

ఇళ్ళ కప్పు లెగిరి పోతున్నాయి.

గుడిసెలు గాలిలోకి లేస్తున్నాయి.

చెట్లు కూలిపోతున్నాయి. పశువులు భయంకరంగా అరుస్తూ పరుగెడుతున్నాయి. కానీ, ఊరూ వాడ ఒకటై పోవడంతో పరుగెట్టలేక పోతున్నాయి.

అంతా జలమయం. కను చూపు మేరకు ఎక్కడా ఒక్క ఇల్లు కూడా కనిపించడం లేదు. పూరి గుడిసెలు తేలుతున్నాయి. మేకలు, పశువులు, చిన్న పిల్లలు పెద్ద వాళ్ళు ఈద గలిగినంత మేరకు ఈదు తున్నారు. ఎక్కడో దుంగ దొరికితే పట్టుకోవచ్చుని వాళ్ళలో కొందరి ఆశ (బతుకుతామనే నమ్మకం వాళ్ళని వడి పించినా మృత్యువు అతి చేరువలో వున్నా నని గుర్తు చేస్తూంది) క్షణాల క్రితం ప్రాణాలతో కనిపించిన వాళ్ళే క్షణాల్లో శవాలై పోయారు. మృత దేహాలతో ఊరు శ్మశాన వాటికలా మారింది.

అయినా వర్షం తగ్గలేదు.
హరిజనుల వాడ పూర్తిగా పోయింది
పప్పులు, బియ్యం, నూనెలు అంతా
నీటి పాలే.
పైస పైసకు అప్పులు, లెక్కలు
చూసే కొట్ల

యజమానులు ప్రాణాలు బిగ బట్టుకుని పీకల దాకా వచ్చిన నీళ్ళలో ఈదలేక మూలుగుతున్నారు. వడ్డీలకు వడ్డీలు రాసు కున్న షావుకార్లు కొన ఊపిరితో మూలుగుతున్నారు.

ఊళ్ళో అగ్ర వర్ణాల తాల్కూకు మేడ ఇళ్ళు కూడా మునిగిపోతున్నాయి. వాళ్ళంతా మేడల మీద కూర్చున్నారు. ఎంత సేపు? మరో గంటో రెండు గంటలో అలా వర్షం కురిస్తే వాళ్ళ సంగతి కూడ అయిపోతుంది. కాకపోతే డబ్బు గల వాళ్ళు మరి కొంచెం సేపు ప్రాణాలతో వుండగలరు. అంతే ... ఎంతసేపో చెప్పలేరు.

అగ్రహారం అయిపోతూంది. ఇంత జరుగుతున్నా

ఎక్కడో ఒక కోడి కూత వినిపించింది.

దేవుడు తల పైకెత్తి చూశాడు. ప్రవాహంలో కొట్టుకు పోతున్న ఒక గుడిసె మీద నిలబడిన 'కోడిని చూసిన దేవుడు' ఆశ్చర్య పోయాడు. అది తొలి కోడి కూత కాదు- ఆ కోడి కూసిన ఆఖరి కూత అని మరు క్షణం దేవుడికి తెలిసింది. 'ప్చ్' అను కున్నాడు.

దేవుడు కుంటివాడు. అగ్రహారంలో అడుక్కుతినే బిక్షగాడు. ప్రతిరోజు జోలె పట్టుకుని ఇంటింటా యాచిస్తూ జోలె నిండగానే నాలుగు మెతుకులు తిని ఎవరికైనా ఏ సహాయమైనా చేస్తూ బ్రతుకుతుంటాడు. దేవుడి అసలు పేరు అది కాదు. కానీ ఎవరికి ఏ సహాయం కావాలన్నా చేస్తాడు కనుక అందరూ అతన్ని 'దేవుడు' అంటారు. తన వైకల్యం దేవుడికి ఏ నాడూ అడ్డుకాలేదు. తను చేసే సహాయానికి ప్రతిఫలం ఆశించడు. అవసరమైనంత మేరకు యాచిస్తాడు. తనకంటూ ఏదీ మిగుల్చుకోలేని దేవుడికి ప్రాణం మీద తీపి లేదు.

గుప్పెట్లో ప్రాణాన్ని నెత్తి మీద మోయ గలిగేనంత ఆస్తినీ తీసుకుని జల ప్రవాహంలో పరుగెడుతున్న వాళ్ళని చూసి నవ్వుకున్నాడు దేవుడు.

పోయే ప్రాణాన్ని ఆపుకోవాలనుకుంటున్నారు. పిచ్చివాళ్ళు. చావు రమ్మంటే రాదు- రావద్దంటే రాక మానదు. మృత్యువు ను తప్పించుకోవడం ఎవరికి సాధ్యం కాదు. దేవుడు చదువుకోలేదు- అతనికి తన కంటూ ఎవరూ లేరు. ఏకాకి. దురదృష్ట వశాత్తు తను మిగిలిపోయాడు అనుకుంటాడు దేవుడు. బ్రతకడం కొందరికి అవసరం. బాధ్యతలు నెత్తి మీదున్న వాళ్ళు బ్రతకాలి. కానీ తను ఎవరి కోసం బ్రతకాలి- కేవలం తనను తను పోషించుకుంటూ కాకిలా బ్రతకడం వల్ల లాభం లేదను కుంటాడు దేవుడు. తను ఎవరికీ అవసరం లేదు. తన వల్ల సహాయాలు పొందేవాళ్ళు కూడా అప్పటి కప్పుడు తనను గుర్తుంచుకుంటారు గానీ తర్వాత తనెవరో! వాళ్ళెవరో.

గాలి హోరు మరింత పెరిగింది- వర్షం జోరు మరింత పెరిగింది- అంతటా ఆక్రందనలు- హాహా రావాలు, గావు కేకలు- పెడ బొబ్బలు- మృత దేహాల కుళ్ళు కంపు.

మధ్యాహ్నం మూడు గంటలకే రాత్రి పది గంటలలా చీకటి- చిమ్మ చీకటి-

దేవుడు కుంటివాడే అయినా కష్ట పడి పెద్ద వేప చెట్టు మీదికెక్కి కూర్చుండి పోయాడు. అంత వరకూ ఆ సాహసం చెయ్యడానికి భయపడిన మరి కొందరు ప్రక్కనే వున్న చెట్లు మీది కెక్కేసారు.

దేవుడు కూర్చున్న చెట్టు మీదికి 'రత్తి' కూడా ఎక్కింది. రత్తి పొలం పనులు చేసుకుంటుంది. ఆ ఇద్దరూ నిన్న పొద్దున్న చెట్టెక్కిన వాళ్ళు. రాత్రంతా చెట్టు మీదే కూర్చున్నారు. చావు వస్తే వస్తామని ధైర్యంగా వున్నారు. తడిసి తడిసి ముద్దైపోయిన ఆ ఇద్దరు నీరసించి పోయారు. ఆకలి ఒకవైపు చంపేస్తూంది. ప్రాణ భయం కన్నా ఆకలి క్రూరమైంది.

దేవుడు రత్తి కేసి చూస్తున్నాడు.
రత్తి అందగత్తె. మంచి వయసులో
వుంది.
పిట పిట లాటే అవయవ సంపద.
మనిషి కాస్త నలుపే అయినా
దిట్టంగా వుంటుంది.

కానీ ... రత్తి మొగుడు గవురయ్య సన్నగా, రివటగా వుంటాడు. మొహం మీద స్ఫోటకం మచ్చలు ... కీచు గొంతు, వికారంగా వుంటాడు. వాళ్ళ దాంపత్యం అనుకూలించి ఒక కూతుర్ని కూడా కన్నారు. రత్తి కోసం ఊళ్ళో ఎందరో ఎగ బడ్డారు. కొందరు పెద్దోళ్ళు డబ్బు ఆశ కూడా చూపించారు. కానీ రత్తి అగ్గిలా పవిత్రంగా నిలిచింది. ఆ అగ్గి దగ్గరికి రావ డానికి చాలా మంది భయపడ్డారు; ఆ తర్వాత.

మరి ఆ రత్తి ... గవరయ్యను ఎందుకో మనువాడింది- అంత వరకూ సరే. కానీ మనువాడిన వారం రోజుల్లో గవరయ్య కళ్ళు పోయాయి. అసలే వికారం- పైగా గుడ్డి వాడు. అటువంటి భర్తతో అందగత్తె రత్తి ఎంతో అనురాగంగా బ్రతుకుతూంది. అందానికి మనసుకూ సంబంధం లేదు. గవరయ్య లోని మంచితనం రత్తిని ఆకట్టుకుంది- అతనిలోని అమాయకత్వం, రత్తి పట్ల అతనికి వున్న ప్రేమ రత్తిని అతనికి సన్నిహితం చేసింది-

గవరయ్య లేకపోతే చచ్చి పోగల్ను అంటుంది రత్తి.

వాళ్ళ కూతురే గౌరి-

రత్తి చెట్టు మీదుండే గానీ దాని మన సంతా మామ మీదే వుంది- గౌరి మీదే వుంది. వారం మొదలైన రోజే అగ్రహారం వదిలి పట్నం పోయిన మావ తిరిగి రాలేదు. అక్కడ ఎవరో పెద్ద మడిసి గవరయ్యను కళ్ళ డాక్టరు దగ్గరికి తీసుకెళ్ళి కళ్ళు తెప్పించడానికి సహాయం చేస్తానన్నాడట. నేత్రదాన కేంద్రాలలో నుంచి ఎవరైన కళ్ళు ఇస్తే వాటిని గవరయ్యకు పెడదామని ఆ పెద్ద మనిషి అనుకున్నాడు. ఊళ్ళో అందరికీ పెద్దగా, మంచి మనిషిగా పేరున్న మాధవరావుగారు కొడుకు డాక్టర్. అతని సిఫారుసుతోగవరయ్య పట్నం వెళ్ళాడు. మాధవరావు పొలంలో రత్తి పని చేస్తుంది. గుడ్డి వాడు గవరయ్యకు తోడుగా పన్నెండేళ్ళ గౌరి కూడా వెళ్ళింది. అలా పట్నమెళ్ళిన వాళ్ళు ఏమయ్యారో ఏమో! అని బెంగ పెట్టుకుంది రత్తి. ఇంచు మించు ఒక రోజంతా చెట్టు కొమ్మ మీద కూర్చోవడం మూలాన నడుంపడిపోతూంది. పైగా ఎడ తెరిపి లేని వర్షంలో తడవటం మూలాన తల బరువెక్కి పోయింది. జ్వరం వచ్చి పట్టింది రత్తికి. కానీ దాని కళ్ళు మావను వెతుకుతున్నాయి. అయినాఊరంతా జలాశయంగా మారినపుడు గుడ్డి మావ, కూతురు ఎలా వస్తారు? అందుకే మళ్ళీ తనను తానే సంబాలించుకుంటూంది రత్తి అలా వస్తే ఇటువంటి ప్రళయం వచ్చేసిందేమో? అలా వస్తే గవరయ్య, గౌరీ ఎమై పోతారో? రత్తి ఆలోచనలు గవరయ్య మీద గౌరి మీద తిరుగుతున్నాయి.

గంటకు వంద కిలోమీటర్ల వేగంతో తుఫాను వీస్తూంది. చెట్లు, పుట్టలు, గుడిసెలు, గోపురాలు వాయు వేగానికి తట్టుకోలేక కూలి పోతున్నాయి. ఊళ్ళో చెరువు దగ్గరే వున్న రామాలయంలో గర్భ గుడిలోకి నీళ్ళొచ్చేసింది. సీతమ్మ వారి ముక్కు పుడక కూడా వర్షం నీళ్ళలో మునిగి పోయింది. భగవంతుడికే మునక తప్పని వేళ పాపం మనుషులు కంగారు పడి పోతున్నారు. గోపురం మాత్రం గాలి తాకిడికి తట్టుకుంటూ నిలబడినా ఏ క్షణాన్నైనా కూలి పోతుందేమోనని భయ మేస్తూంది.

దేవుడు రత్తిని గమనిస్తున్నాడు.
రత్తి మోహం పారిపోయింది-
అగ్రహారం వల్లకాడై పోతూంది-
మళ్ళీ ఈ శ్మశానం అగ్రహారంగా
మారాలంటే

ఎంతోమంది కష్టపడాలి. కష్టపడినా ఈ జీవిత కాలంలో నష్ట పోయిన ఆస్తి పాస్తులను ఎంత మంది మళ్ళీ సంపాదించుకోగలరు. సంవత్సరాల తరబడి శారీరకంగా, మానసికంగా కష్టపడి, ఎన్నో తీర్మానాలు చేసి, కడుపు కట్టి, కాలుకట్టి, మిగల్చుకున్న కొద్దో గొప్పో కూడా ఒక ప్రళయానికి ఆహుతై పోతే మళ్ళీ ఆ మనిషి పోగొట్టు కున్నంత సంపాదించుకోగలడా? ఇంచు మించు ఊళ్ళో అందరూ, ఏ కొద్ది మంది పెద్ద కులాల వాళ్ళు తప్ప తమ ఆసిత పాస్తులను పోగొట్టుకున్నారు. శవాల మీది బంగారం మెరిసి పోతూంది- వాటిని ఎలాగైనా కైవసం చేసుకోవాలనుకుని ఈదుతూ వెళ్ళిన వాళ్ళు కూడా శవాలై పోతున్నారు. ప్రళయంలో కూడా ఆశ. ఒక శవం మరొకరి నమ్మకం. ఛ ఛ- మనుషులు అనుకుంటున్నాడు దేవుడు.

రత్తి సంగతి తెలుసుకున్నాడు దేవుడు.

పాపం భర్త కోసం, కూతురి కోసం బెంగ పెట్టుకుంది- నిజానికి తను బ్రతుకుతుందో లేదో దానికే తెలియదు- అనుకున్నాడు దేవుడు.

వర్షం కొంచెం తగ్గింది -
తుపాను కూడ తగ్గింది -
వరద వేగం మాత్రం తగ్గలేదు -

ఆవులు, మేకలు, పాములు, కప్పలు, సకల చరా చర కోటి, మనుషులతో కలిసి, వరదలో కొట్టుకు పోతూ కనిపిస్తున్నారు.

తుంపర మాత్రం పడుతుంది.

తడిసి ముద్దైపోయిన శరీరాలు చెట్ల మీద పండు టాకుల్లా వణుకుతున్నాయి.

అప్పుడే ప్రమాదం జరగడానికి ప్రారంభమైంది.

వర్షపు నీళ్ళకు నాని, నాని దేవుడు కూర్చున్న చెట్టు కొమ్మ కిందికి మెల్లగా వంగుతూంది- చెట్టు క్రింద పదిహేను అడుగుల లోతు నీళ్ళు వరదలా ప్రవహిస్తూంది. కొమ్మ మీది తనో రత్తో ఆ ప్రవాహంలో పడితే అంతే ... దేవుడు ఆలోచించాడు. తను చచ్చిపోతే కనీసం ఒక్క కన్నీటి బొట్టైనా కార్చ డానికి ఎవ్వరూ లేరు తనకు. అంతేకాదు, మామూలు రోజుల్లో తను చనిపోతే, తనను మోయడానికి గానీ, కర్మ కండ చెయ్యడానికి గానీ, శవ దాహనం చెయ్య డానికి గానీ తన కెవ్వరూ లేరు. తన శరీరం కేవలం అనాథ ప్రేతమవుతుంది. ఇటువంటి ప్రళయాల్లో, వరదలో తను కొట్టుకు పోతే తను చచ్చి ఎవ్వరికీ కష్టం కలిగించ కుండా పోవచ్చు. ఎంతో మందితో బాటూ తనూ చావచ్చు. తను చచ్చిపోతే ఎవ్వరికీ నష్టం లేదు.

కానీ రత్తి ... అలా కాదు- రత్తి బ్రతకాలి.' రత్తి బ్రతుకుతేనే గవరయ్య బ్రతగ్గలడు- రత్తి బ్రతికితేనే దాని కూతురు గౌరి బ్రతుకుతుంది. రత్తి చస్తే దాని మొగుడు, కూతురు ఇద్దరూకష్టపడతారు- తన ప్రాణం కన్నా రత్తి ప్రాణం విలువైనది. రత్తి ప్రాణం మరో ఇద్దరి ప్రాణాలను కాపాడ గలిగే శక్తి కలదు.

కనుక తను బ్రతకడానికి ప్రయత్నించడం కన్నా రత్తిని బ్రతికించడానికి ప్రయత్నించాలి-

అందుకు మార్గం ఒక్కటే-

తన బరువు వల్ల వంగిపోతున్న కొమ్మను వంగకుండా చెయ్యాలి-

అంటే కొమ్మ బరువు తగ్గాలి-

కొమ్మ బరువు తగ్గకుంటే- తను ... ఆలస్యం చెయ్యకుండా కిందికి ... ఉరకలు వేస్తూ పరుగెడుతున్న ప్రవాహం లోకి దూకాలి- సరే తను దూకిం తర్వాత మళ్ళీ వర్షమొచ్చినా, గాలి వీచినా చెట్టు కూలి పోయినా, రత్తికి ప్రాణాపాయం జరిగితే ... ఆలోచించాడు దేవుడు- అది దాని కర్మ- తనకు చేతనైన సహాయం, జీవన్మరణ సమస్య ఎదురైన వేళలో తను చేయగలిగిం దల్లా తను చేస్తూ. మరో మనీషిని బ్రతికించ డానికి ప్రయత్నించడమే-

ఆ తర్వాత జరిగేవీ- జరగనివీ తనకనవసరం- అనుకుంటూ రత్తి కేసి చూశాడు దేవుడు-

'దేవుడ్రో- కొమ్మ వంగిపోతున్నది- పడితే సావగలం' అంది రత్తి ...

దేవుడు చూపులు దీనంగా వున్నాయి-

రత్తికి ఆ చూపుల్లోని అంతరార్థం తెలియలేదు-

మూగ మనుసులు వాళ్ళవి- రత్తి మొహం తిప్పకుంది.

మరో రెండు నిమిషాల తర్వాత మరోసారి దేవుడి కేసి చూద్దామని మొహం తిప్పిన రత్తి ఆశ్చర్య పోయింది -

దేవుడు కొమ్మమీద లేదు.

ఆశ్చర్యంతో ప్రవాహం కేసి చూసిన రత్తికి దూరంగా దేవుడు రత్తికి చేతు లూపుతూ కనిపించాడు. ఎర్ర చొక్కా పీకల దాకా మునిగిపోయింది- కనుచూపు మేరలో జల ప్రవాహంలో తన కళ్ళ ముందే దేవుడు శవమై పోయాడు- ప్రళయంలో సమిధగా మారాడు- మెల్లగా వర్షం తగ్గి ఆకాశం తెరిపిచ్చింది- మర్నాడు మధ్యాహ్నానికి జల ప్రవాహం తగ్గు ముఖం పట్టింది. సూర్యకిరణాలు తీవ్రంగా పొడుచుకు వచ్చాయి. చచ్చినా జంతువుల కళేబరాలు మానవ శరీరాలు కుప్పలు కుప్పలుగా కనిపిస్తున్నాయి.

రత్తి చెట్టు దిగడానికి కొందరు సహాయం చేశారు. మూర్ఛపోయింది దిగ గానే- ప్రభుత్వం పంపించిన అన్నం పొట్లాలో ఒకటి రత్తికి కూడా ఎవరో ఇచ్చారు. ఆకలి కొంచెం తీరగానే లేని శక్తిని కూడ దీసుకుని గవరయ్య కోసం- గౌరి కోసం ఎదురు తెన్నులు చూడడం మొదలు పెట్టింది రత్తి.

** ** **

రెండో రోజు మధ్యాహ్నం గౌరి, తండ్రి గవరయ్య చెయ్యి పట్టుకొని మృత దేహాల కుప్పలు దాటుకుంటూ ఊళ్ళోకి వస్తూంది. గవరయ్య కాలికి ఎవరిదో శరీరం తగిలింది- పడబోతున్న తండ్రిని పట్టుకుని "ఎవరో ... సచ్చిపోయిండు పాపం" అంది గౌరి-

అది తమ కోసం ప్రాణ త్యాగం చేసిన దేవుడి శవమని పాపం వీళ్ళకు తెలియదు.



నోరూరించే ద్రాక్షలు

ద్రాక్షలంటే ఎవరికి చేదు? అక్షరాలు రెండే అయినా, వాటిని నోరారా పలికినప్పుడు మాత్రం నీళ్ళూరుతాయి. పొడుగైన కాడని సున్నితంగా అంటి పెట్టుకుని, గుత్తులుగుత్తులుగా వ్రేలాడే అంగూరాల కథ బహు పురాతనమైనది. ఎనిమిది వేల సంవత్సరాల నాటి ఈజిప్టు కళా కృతుల్లో అంగూర కల్పన లున్నాయి. బైబిల్ కథల్లో నరేసేరి, ద్రాక్ష తీగలు, ద్రాక్ష సారాయి పలు సందర్భాల్లో కనిపిస్తాయి. వృక్ష శాస్త్రజ్ఞులు 'విటిస్ విని ఫెరా' అని పిలిచే ద్రాక్షలో ఎన్నోరకాలూ, రంగులూ వున్నాయి. కాకేసియాలో పుట్టిన ద్రాక్ష, పశ్చిమ ఆసియా, దక్షిణ ఐరోపా, అల్జీరియా, మొరాకో, ప్రాంతాలకు విస్తరించింది. మన దేశానికి ద్రాక్షలు శతాబ్దాల క్రిందటే వేరు కున్నాయి.

ద్రాక్షలో పోషకాహారాలున్నాయి. కార్బోహైడ్రేట్లు, గ్లూకోజ్ పుష్కలంగా వున్నందు వలన సులభంగా జీర్ణం అవుతాయి. దేహానికి అవసరమైన వేడిని, శక్తిని త్వరిత గతిని అందజేస్తాయి.

ద్రాక్షలో ఓషధి గుణాలున్నాయి. అజీర్తి, మల బద్ధకం, మూర్ఛ, శిరోవేదనం, మూత్ర పిండాల వ్యాధులకు ఇవి అద్భుతమైన ఔషధంగా పనిచేస్తాయి. ఇంగ్లండ్‌లో, జర్మనీలో ప్రకృతి వైద్యులు ఎన్నో రోగాల్ని ద్రాక్ష ఫలహారంతో నయం చేస్తున్నారు. జోహాన్నా బ్రాండిట్ అనే ఆమె, "ద్రాక్షలతో చికిత్స అనే పుస్తకం రాశారు. విశేషం ఏమిటంటే - జోహాన్నా అరవై అయిదేళ్ల క్రితం తనకుసోకిన కేన్సర్ వ్యాధిని, కేవలం ద్రాక్షలే సేవిస్తూ నయం చేసుకున్నారు.

ఔషధాలుగా ద్రాక్షల వాడుక గురించిఒక కథ కూడా ప్రచారంలో వుంది. మునుపు జెమ్ షెడ్ అనే రాజు గారు సీసాల నిండా ద్రాక్ష రసాన్ని నిలవచేసి, ఇంట్లో వాళ్ళ వాటిని తాకరాదనే ఉద్దేశంతో సీసాల్లో విషం వుందని అందరికీచెప్పేవాడు. అతని శ్రీమతి తీరని శిరో వేదనతో బాధపడేది. ఎన్ని మందులు వాడినా, ఉపయోగం లేకపోవడంతో సీసాల్లో విషాన్ని తాగి మరణించాలనుకుంది. గట గటా త్రాగి, అంతా అయిపోయిందను కున్న ఆమెకి మంత్రం వేసినట్లు తలనొప్పి మటు మాయం అయిపోయిందిట. అదీ సంగతి.

-హిమబిందు

మడగాస్కర్ దేశ జానపద గాథల కథానాయిక 'ఇమాసువ వాలా'